క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అర్జున్



తుర్కయంజాల్: జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తుర్కయంజాల్‌కు చెందిన గుడ్ల అర్జున్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. అర్జున్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి వచ్చేందుకు సహకరించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడుశివసేనారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

యాచారం డీటీగా కీర్తిసాగర్



యాచారం: మండల ఉప తహసీల్దార్‌గా కీర్తిసాగర్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. యాచారంలో ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ప్రవీణ్‌కుమార్ బదిలీపై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంకు వెళ్లారు. కీర్తి సాగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ భూసేకరణ విభాగం నుంచి యాచారంకు బదిలీపై వచ్చారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీరామ్



ఇబ్రహీంపట్నం రూరల్: అఖిల భారత యాదవ మహాసభ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉప్పరిగూడకి చెందిన ఎల్లపల్లి శ్రీరామ్‌యాదవ్‌ను నియమించారు. మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్.. శ్రీరామ్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో సంఘం సభ్యులందరికీ అండగా నిలుస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్వర్‌యాదవ్, రఘునాథ్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాది జనరంజక పాలన

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సీఎం కేసీఆర్‌ది జనరంజక పాలన అని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎల్మినేడులోని తన స్వగ్రామం నుంచి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకు వెళ్తున్నామన్నారు. ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం


సర్పంచ్ తులసీరాంనాయక్



సక్రునాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: ఉద్యోగులకు బదిలీలు సహజమని మైసిగండి సర్పంచ్ తులసీరాంనాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న సక్రునాయక్ మంగళవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం సక్రునాయక్‌ను గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వార్డు సభ్యులు, నాయకులు పంత్యానాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, రాజు, శంకర్, రమేశ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో లాభాలు



విద్యార్థులతో శక్రునాయక్, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: పట్టుపురుగుల పెంపకం చాలా లాభదాయకమని పట్టు పురుగుల పెంపకం జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు శక్రునాయక్ అన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. కల్వకుర్తి కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన నిమిత్తం మండల పరిధిలోని కోరింతకుంట తండాకు మంగళవారం విచ్చేశారు. 80 మంది విద్యార్థులతో పాటు కళాశాల అధ్యాపకులు వచ్చి పట్టు తోటలను పరిశీలించారు. ముఖ్య అతిథిగా హాజరైన శక్రునాయక్ పట్టుపురుగుల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు దత్రు, వినోద్, శక్రు, విద్యార్థులు, అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో అధికారం ఖాయం

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి



కడ్తాల్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వంశీచంద్‌రెడ్డి, కసిరెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం/కడ్తాల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని సూచించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, భాస్కర్‌రెడ్డి, రవినాయక్, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జహంగీర్‌అలీ ఉన్నారు.

మైసమ్మను దర్శించుకున్న నేతలు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ఆలయంలో మంగళవారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, హన్మానాయక్, నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్ , బిక్కు, శేఖర్‌గౌడ్. నరేశ్ ఉన్నారు.

ఓట్ల కోసం కపటప్రేమ..

బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ముందు ఓట్ల కోసం కపటప్రేమ వలకబోస్తున్నారని.. దీనిని ప్రజలు గుర్తిస్తున్నారని టీపీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సుమారు 30 లక్షల ఇళ్లు పేదలకు కట్టిస్తే.. డబుల్‌బెడ్రూం ఇళ్ల గురించి గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో దాదాపు పదేళ్లలో 3 లక్షల ఇళ్లుకూడ పేదలకు కట్టించలేదని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల అంశంపై గ్రామాల్లో ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని గ్రహించిన పాలకులు గృహలక్ష్మీ పథకం పేరుతో మోసం చేద్దామని చూశారన్నారు. నియోజకవర్గంలో ఎంతమందికి గృహలక్ష్మి సహాయం అందజేశారో స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తెలపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసిచూపిస్తామన్నారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, అర్చన, శరణ్, మహిపాల్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం

కాంగ్రెస్ సీనియర్ నేత సుంకిరెడ్డి



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: కార్యకర్తల అభీష్టం మేరకే నడుచుకుంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని దేవకీ ఫంక్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ.. పార్టీలోకి నూతనంగా వచ్చిన వారికి కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్ ఇవ్వరాదని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని, సర్వేలను పరిగణలోకి తీసుకోవాలని.. కష్ట కాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సేవలను పార్టీ అధిష్టానం గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయమే తనకు శిరోధార్యమని.. మీ అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. ఇతర పార్టీ నుంచి వచ్చిన నాయకులకు టికెట్ ఇస్తే.. గెలిచాక తిరిగి సొంత పార్టీల్లోకి వెళ్లకుండా ఉంటాడని నమ్మకమేంటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎన్ఎస్‌యూఐ యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 20 మంది నాయకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో వారు గులాబీ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే సమన్యాయం సాధ్యమన్నారు. బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌నాయక్, లాలయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మంచాల: మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం మంచాల ఎంఈఓ కార్యాలయ ముట్టడికి యత్నించారు. వారు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని 13 రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత 9నెలలకు సంబంధించిన వంట బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేదన్నారు. వేతనాలు 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గుడ్లకు సంబంధించి మూడు సంవత్సరాల బిల్లులు ఇవ్వడం లేదన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించలేని ప్రభుత్వం తాజాగా టిఫిన్స్ పెడతామని మరోసారి మోసం చేయడానికి చూస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సంతోష, పద్మ, భారతమ్మ, జంగమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి



ఉప్పల వెంకటేశ్‌ను సన్మానిస్తున్న రాంపూర్ నాయకులు

'మిషన్ భగీరథ' వైస్‌చైర్మన్ ఉప్పలను సన్మానించిన నేతలు

తలకొండపల్లి: మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను రాంపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఏంపీపీ నిర్మలఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వెంకటేశ్‌ను కలిసిన రాంపూర్ గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్న హరిమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాదయ్య, లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీశైలంయాదవ్, ఆలయ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, కమిటీ సభ్యులు అంజిరెడ్డి, రాందాసు, మహేశ్, పాండు, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన కడ్తాల్ నాయకులు..

కడ్తాల్: మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా నియమితులైన తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను మండల కేంద్రానికి చెందిన ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఫ్లెక్సీల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న రవీంద్రసాగర్

మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎలాంటి ప్రచారాలు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వివిధ పార్టీల ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్ల తొలగింపు పనులను కమిషనర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్యక్రమాలైనా.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఎలాంటి బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు పెట్టినా, అనుమమతి లేకుండా ప్రచారాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

'నిరుపేదలకు న్యాయం చేస్తా'



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: రోడ్డు పక్కన గుడిసెలు వేసుకున్న వారికి తగిన న్యాయం చేస్తామని, అప్పటి వరకు వారి నివాసాలను తొలగించకుండా చూస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా హయత్‌నగర్‌లోని రేడియో స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన గుడిసెలను తొలగించాలనే ప్రయత్నం జరుగుతున్నదని తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. సంబంధిత అధికారి ధర్మారెడ్డికి ఫోన్ చేసి వారి సమస్యను వివరించారు. కొన్ని రోజులు సమయం ఇస్తే వారిని మరో చోటికి తరలిస్తామని, అప్పటి వరకు గుడిసెలను తొలగించరాదని ఆయనను ఎమ్మెల్యే కోరారు. దీంతో గుడిసెల వాసులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

సోషల్‌మీడియా పోస్టులపై నిఘా

ఎస్ఐ బల్‌రాం



ఆమనగల్లు: సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై పోలీసుశాఖ నిఘా పెడుతుందని ఆమనగల్లు ఎస్ఐ బల్‌రాం అన్నారు. ఆమనగల్ పీఎస్‌లో మంగళవారం ఎస్ఐ బల్‌రాం విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో ఇతర పార్టీలను, ఇతర వ్యక్తులను రెచ్చగొట్టే విధంగా, అవమానపరిచే విధంగా పోస్టులు పెట్టి వైషమ్యాలు సృష్టించేవారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎలాంటి వివాదాలు లేకుండా పోస్టులు ఉండేలా చూసుకోవాలని సలహా ఇచ్చారు. వాట్సాప్ గ్రూపుల్లో అడ్మిన్లు సభ్యుల గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే గ్రూప్‌లో జాయిన్ చేసుకోవాలని.. ఎవరైనా రెచ్చగొట్టే పోస్టులు పెడితే వెంటనే వారిని గ్రూపు నుంచి తొలగించాలని లేదంటే ఆ సంఘటనలకు సంబంధించి ఆయా గ్రూపుల అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్ఐ హెచ్చరించారు.

నారాయణకు నివాళి



నారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ ప్రథమ వర్ధంతిని మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి గాలయ్య, కమిటీ సభ్యులు సుగంధ, కిషన్ చౌహాన్, రామకృష్ణ, వెంకటేష్, కిరణ్‌కుమార్, నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19 రిజిస్ట్రేషన్లకు ఆఖరు తేదీ అన్నారు. వివరాలకు 9848224586ను సంప్రదించవచ్చు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పంకజ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది.ఈఆర్‌ఓగా ఎల్‌బీనగర్ సర్కిల్-3 డీసీ రవీందర్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారులుగా ఎల్‌బీనగర్ సర్కిల్-4, సర్కిల్-5 డీసీలు దశరథ్, అరుణ కుమారి, సునీతలు నియమితులయ్యారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 13, వంకాయ 48, బెండ 28, పచ్చిమిర్చి35, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 33, దొండ 28, ఆలు 21, ఉల్లి 26, గోకర 35, దోస 13, సొర 15, పొట్ల 23, అరటి 09, చిక్కుడు 65, అర్వి 41, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 55. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కౌన్సిలర్ భర్తపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

మున్సిపల్ కార్యాలయం ఎదట సిబ్బంది నిరసన

తుర్కయంజాల్: శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అతడిపై దాడికి యత్నించిన కౌన్సిలర్ భర్త గుండా ధన్‌రాజ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ బాల్‌రాజ్, నగేష్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రకులాల ఆధిపత్యాన్ని కూలదోద్దాం



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

ఇబ్రహీంపట్నం: అగ్రకులాల అధిపత్యం కూలదోసి అధికార పగ్గాలు చేపట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకం కావాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ పరిధిలో 93 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలుంటే మూడు శాతం లేని అగ్రవర్ణాలకే ఆయా పార్టీలు ఎలా టికెట్లు కేటాయిస్తున్నాయని ప్రశ్నించారు. రాజ్యాధికారాన్ని దక్కించుకునేందుకు సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం టార్చిలైట్ గుర్తును మన పార్టీకి కేటాయించిందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి ఇబ్రహీంపట్నం స్థానం నుంచి పోటీలో ఉంటారని చెప్పారు. డీఎస్పీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర, వినోద్‌యాదవ్, రవీందర్, భిక్షపతి, రాకేష్, భవానిశేఖర్, గజ్జ భాస్కర్, భవాని కిషన్, నాగార్జున, ప్రదీప్, ప్రవీణ్, రంజిత్‌లు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

భారీగా మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో వెంకటేశ్ అనే వ్యక్తి కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన నిందితుడు డబ్బు సంపాదించాలనే ఆశలో తన షాపు ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో మద్యం విక్రయిస్తున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సోదాలు చేశారు. నిందితుడి వద్ద నుంచి 173 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రతి రోజూ ఆటలు ఆడితే మానసికంగా, శారీరకంగా ఎంతో మేలు జరుగుతుందని, విద్యార్థులు చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, మద్దిలి శివారెడ్డి, మమతా, మల్లేశ్‌గౌడ్, సంగిశెట్టి భవాని, రేణుక, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.